# జవాబేమిటి జగన్నాథం?

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 9-10-96)

---

"పుట్టలోన చెదలు పుట్టవా....గిట్టవా! అన్నారు ఇలాంటి అప్రాచ్యుల్ని చూసే....ఛీ....ఛీ వెధవలు వెధవలావి... నీ లాంటి కొడుకు ఉండేకంటే ఉండకపోతేనే హాయి" కోపంతో వూగిపోతూ అన్నాడు జగన్నాధం.

తండ్రి మాటలకు బదులీయకుండా మౌనంగా వుండిపోయాడు సతీష్.

"కన్నవారి కంటనీరు పెట్టించిన వాడెవ్వడూ బాగుపడడు. అది నీకు శుభంకాదు. మా మనస్తాపం నీకు మేలు చేయదురా! డబ్బొక్కటే ముఖ్యం కాదురా మనిషికి! దానికంటే అతిముఖ్యమైనవి చాలా వున్నాయ్" ముఖం కందగడ్డలా మారిందాయనకు.

ఆయన మాటలు పట్టించుకోనట్లు నిర్లిప్తంగా వుండిపోయాడు సతీష్.

అతనిమౌనం జగన్నాధానికి మరింత ఉక్రోషాన్ని కలిగిస్తోంది.

"కన్నవారిని కంటికి రెప్పలా చూసుకోవలసింది పోయి, కాటికి పోయేవరకూ కావలసినన్ని కాసులు పారేస్తాను. మీ చావు మీరు చావండంటూ కట్టుకున్న దాంతో కులుకుతూ కూర్చోవటానికి సిగ్గుగా లేదురా నీకూ?" కొడుకువంక తీక్షణంగా చూస్తూ అన్నాడాయన.

"ఎందుకండీ మీ కంఠశోష? చెవిటి వాడి ముందు శంఖం వూది ఏమిటి ప్రయోజనం? అయినా ఆపాటి జ్ఞానం వాడికుండాలి.

వయసొచ్చి ఏం లాభం? అమ్మానాన్నల్ని అపురూపంగా చూసుకోవాలని ఒకళ్లు చెప్పాలా? ఇలాంటి బిడ్డలకంటె గొడ్లునయం" అప్పటి వరకూ కొడుకు నుంచి ఏదైనా సమాధానం వస్తుందేమోనని ఎదురు చూసి నిరాశ పడిన తల్లి లలితాంబ గొంతు విప్పింది.

"తల్లిదండ్రులు ఎంతగా కష్టపడితే తామింత వాళ్ళయ్యారో ఎందుకు ఆలోచించరో వెధవలు. పుట్టగానే పెరిగి పెద్దవాళ్ళవయామనుకుంటారు కాబోలు" వ్యంగ్యంగా అన్నాడు జగన్నాథం.

"ప్రేమ, అనురాగం, ఆత్మీయతా తెలియని కసాయి వాళ్ళకు ఆ ఆలోచనలు ఎట్లా వస్తాయ్? అయినా మన తలరాతలిలా తగలడ్డాక ఎవర్నని ఏం లాభం.... వూరుకోండి" వూరడింపుగా అన్నది లలితాంబ.

ఓ అర నిమిషం తల్లినీ, తండ్రినీ మార్చి మార్చి చూశాడు సతీష్.

"మీకు ఎంత డబ్బు కావాలో చెప్పండి ఒక్కరూపాయి తగ్గించకుండా ఇచ్చేస్తాను. ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేసుకోండి హాయిగా ఉండండి. మళ్లీ మళ్లీ అడిగినా డబ్బు అడగవద్దని మాత్రం నేను అనను" చెప్పేడు సతీష్.

"అక్కర్లేదు.... అవసరమయితే అంతకన్నా గత్యంతరం లేకపోతే అడుక్కుతినైనా బ్రతగ్గలం. తమరేం ధర్మం చేయక్కర్లేదు. దయ చూపనక్కర్లేదు. అలా వీధిలోకి వెళితే చాలు....ఆ పాటిదయా, సానుభూతి పుష్కలంగా లభిస్తాయ్" ఆవేశంగా అన్నాడాయన.

"డబ్బు సంచుల కోసం కాదురా. ఈ వయస్సులో మాకు కావలసింది, మా ఆలనా పాలనా చూసుకుంటూ, ఆత్మీయంగా మమ్మల్ని పలకరిస్తూ, మాకు మానసికంగా ప్రశాంతతను, శారీరకంగా శక్తిని కలిగిస్తూ, మా కళ్ల ముందు మీరు కదలాడుతుంటే మీ ఒళ్లో

కళ్లు మూయాలన్నదే మా కడసారికోరికరా" పెల్లుబికివచ్చే దుఃఖాన్ని దిగమింగుకునేందుకు విఫలయత్నం చేస్తూ చెప్పింది లలితాంబ.

"అయితే ఓ పని చేయండి. నేనుండే వూరికి చాలా దగ్గర్లో "వృద్ధుల సంరక్షణ కేంద్రం" అని ఉంది. అక్కడ చేరుస్తాను హాయిగా ఉండండి. కాలక్షేపం కావలసినంత దొరుకుతుంది. మీలాంటివాళ్లే ఇంకా చాలామంది ఉంటారక్కడ ఎవరికి వారికే ప్రత్యేకమైన గదులు. ప్రతిరోజూ డాక్టర్‌గారి పర్యవేక్షణ టి. వి. ఉంటుంది. అందరూ ఓ చోట కూర్చుని కబుర్లాడుకునేందుకు వీలుగా పెద్దహాలు, మంచి లైబ్రరీ, అప్పుడప్పుడు ఆధ్యాత్మిక ప్రసంగాలు, హరికథలు కూడా చెప్పిస్తుంటారు. ఫీజు ఎంతైనా చెల్లిస్తాను. అప్పుడప్పుడు మేము, పిల్లలం వచ్చి చూసివెళ్తుంటాము సరేనా?" అడిగాడు సతీష్.

"డబ్బున్న మారాజువి నీకేం.... ఎంతైనా విసిరేయగలవ్. కడుపున పుట్టిన బిడ్డలు లేనివాళ్లా, ఉన్నా ఉపయోగం లేనివాళ్లయితే.... అలాంటివారు అనాథలుగా అటువంటి చోట చేర్తారని తెలుసా? తెలిసే అంటున్నావట్రా "ఆ మాటలు" ఈసడింపుగా అన్నది లలితాంబ.

"నేనొక్క మాట అడుగుతాను ... సమాధానం చెప్పండి" అమ్మా నాన్నలవంక చూశాడు సతీష్

"ఈ డబ్బు కోసం కదూ.... ఉద్యోగం అంటూ వూళ్లు పట్టుకుని తిరిగి ముక్కుపచ్చలారని నన్ను అమ్మమ్మ దగ్గర కొన్నాళ్లో' ఆయా దగ్గర కొన్నాళ్లూ ఉంచారు? నువ్వు ఉద్యోగం చేయాల్సిన అవసరం లేకపోయినా చూస్తూచూస్తూ సంపాదనను వదులుకోలేవే కదమ్మా మూడేళ్లు కూడా నిండని నన్ను నర్సరీకోర్సుటూ దూరంగా హాస్టల్లో పడేశావ్" కళ్లల్లోనీరు ఉబికి వస్తుండగా కటువుగా అన్నాడు సతీష్.

భార్యాభర్తలిరువురూ అచేతనంగా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"మాటలు కూడా సరిగారావి నాకు అవయసులో చదువేమిటమ్మా? అమ్మఒడిలో తీయదనం నాకు తెలియనిచ్చారా? నాన్న పక్కలో పడుకుంటే కలిగే కమ్మదనం నన్ను అనుభవించవిచ్చారా? ఈ డబ్బు కోపమేగా నన్ను అలా శిక్షించారు?" "..............."

"కొసరి కొసరి గోరుముద్దలు తినిపించారా నా ముద్దుముద్దు మాటల్ని విని మురిసిపోయారా? ఆ వయసులోనే అందర్తోపాటు కంచంలో పడేసిన మూడు ముద్దలు తిని కదూ నేను పెరిగింది."

"ఈ వృద్ధాప్యంలో మిమ్మల్ని అప్యాయంగా, అనురాగంగా చూసుకోవటం లేదని ఇన్ని రకాలుగా నన్ను నిందిస్తున్నారు. విలదీస్తున్నారు కానీ నాకా వయస్సులో మిమ్మల్నిలా విలదీసేటందుకు బాధ తప్ప భాషలేదు, మనసు తప్ప వయసులేదు. నేను పడ్డ మానసిక క్షోభకు విలువ కట్టారు కదమ్మా? కట్టల కట్టలు ఫీజు కట్టి నా బాల్యాన్ని హాస్టలనే జైల్లో బంధించారు కదమ్మా? అదంతా ఈ డబ్బు కోసమే కదూ?"

'సతీష్!' నివ్వెరపోతూ అన్నాడు జగన్నాథం.

"చుట్టపుచూపుగా నెలకొకసారి వచ్చి నన్ను చూసిపోయారు! వస్తూ వస్తూ పెట్టెల కొద్దీ స్వీట్లు. పేకెట్ల కొద్దీ చాక్లెట్లు నాకిచ్చి మీ ప్రేమని అలా ప్రదర్శించి వెళ్లేవాళ్లు మీరలా వెళ్లగానే ఎక్కిళ్లుపెట్టి ఎలా ఏడ్చేవాణ్నో మీరు వూహించగలరా? అమ్మా నాన్నల ప్రేమ కోసం ఎంత ఆరాటపడ్డానో, మరెంతగా అల్లాడిపోయానో కాస్తంత ఆలోచించండి!"

నిర్విణ్ణురాలైన లలితాంబ నోట మాట పెగలక పోయినా కన్నీటి ధార కట్టలు తెంచుకుంది.

కొడుకు మాటలకు చలించిపోయాడు జగన్నాథం.

పిల్లలు పుట్టగానే సరికాదంటూ ఏమిటేమిటో అంటున్నారే గానీ పిల్లన్ని కనగానే సరికాదంటూ నేనంటున్నాను! ఏం సమాధానం చెప్తారు మీరు? అసలు పిల్లలు పుట్టీ పుట్టముందే వాళ్ల చదువుల గురించీ, సంపాదన గురించీ ఆలోచిస్తున్నారే?.

పిల్లలు బాల్యాన్ని అనుభవించకుండా, బండెడు పుస్తకాల్ని వీపున వేసి చదవమని తరుముతున్నారే!

అనురాగమూ, ఆప్యాయత, అనుబంధాల్లో ఉన్న మాధుర్యాన్ని వాళ్లకు తెలియచేస్తే కదమ్మా వాళ్లు మళ్లీ తల్లి తండ్రులకు అందించటానికి? ఇలాంటి కొడుకులు తయారు కావటానికి మీలాంటి తల్లిదండ్రులు కారణం కాదా నాన్నా? ఇది మీ స్వయంకృతం కాదా? నాకు ఇలాంటి భావాలు కలగటానికి కారకులు మీరు కాదూ? అంటూ భోరున ఏడ్చేశాడు సతీష్

బావురుమంటూ కొడుకుని కౌగిలించుకుని తడిసిన చెక్కిళ్లపై ముద్దుల వర్షం కురిపించింది తల్లి.

"జవాబేమిటి జగన్నాథం?" అంటూ అంతరాత్మ వేసిన ప్రశ్నకు సిగ్గుపడుతూ కండువాతో కళ్లు వత్తుకుని కొడుకును కౌగిలించుకున్నాడు జగన్నాథం.

తడబడిన తండ్రిని అక్కున చేర్చుకున్నాడు లాలనగా సతీష్.

—౦—

(2001 సం॥లో డి.డి.-1 ద్వారా నాటికగా ప్రదర్శింపబడింది)